sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 22-07-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 108 EDITOR: ROHINI



పగిలిన తలలు... రగిలిన తారలు

ఢిల్లీ లాఠీ చార్జిని ఖండించిన సినీ ప్రముఖులు

- విద్యార్థుల పక్షాన నిలిచిన షబానా, సోనాక్షి
- వ్యవస్థ వైఫల్యంపై నందితా దాస్ ఫైర్
- యువత పోరాటానికి సోనాక్షి సిన్హా మద్దతు
- విద్యార్థులు ధైర్యాన్ని ప్రశంసించిన జెనీలియా
- నిరసనలపై దాడికి హుమా ఖురేషి ఆవేదన





దేశ రాజధానిలో నీట్ పేపర్ లీక్ కుంభకోణానికి వ్యతిరేకంగా సాగుతున్న విద్యార్థుల ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారుతోంది. భవిష్యత్తు కోసం గొంతుక విప్పుతున్న యువతపై పోలీసులు జరుపుతున్న దమనకాండ ప్రజాస్వామ్య వ్యవస్థలను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. ఈ సంక్షోభ సమయంలో సినీ ప్రముఖులు, దిగ్గజాలు రోడ్డెక్కి నిలవడం రాజకీయాధికారుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. - సహనం వందే, న్యూఢిల్లీ

న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా జరుగుతున్న ఆందోళనలు దేశ రాజకీయాలను కుదిపేస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ కుంభకోణంపై అలుపెరగని పోరాటం చేస్తున్న విద్యార్థులకు సినిమా రంగం నుంచి ఊహించని మద్దతు లభిస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పోరులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ సెలబ్రిటీలు అందరూ ఒక్కటవుతున్నారు. విద్యార్థుల గొంతుకను అణిచివేయాలని చూస్తున్న పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జంతర్ మంతర్ వద్దకు షబానా

ఇక ఈ నిరసనల్లో సీనియర్ నటి షబానా ఆజ్మీ, నటుడు ప్రకాష్‌రాజ్ నేరుగా జంతర్ మంతర్ వద్దకు వచ్చి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. మన రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకే తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని షబానా స్పష్టం చేశారు. ప్రముఖ బాలీవుడ్ జంట రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా కూడా యువతకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. యువత ధైర్యం, శక్తి సామర్థ్యాలే రేపటి భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని వారు పేర్కొన్నారు.

కలచివేసిన దృశ్యాలు... హుమా ఆవేదన

నిరసన ప్రాంతం నుంచి వస్తున్న విజువల్స్ తనను ఎంతగానో కలచివేశాయని నటి హుమా ఖురేషి ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన విద్యార్థులపై ఇంతటి అణచివేత, లాఠీ చార్జీని చూడాల్సి రావడం బాధాకరమన్నారు. సినిమా రచయిత్రి సుతపా సిక్దర్ విద్యార్థుల కష్టాలను గుర్తుచేస్తూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. జేబులో 10 రూపాయలు వేసుకొని ఎన్నో ఆశలతో అక్షరాల కోసం, న్యాయం కోసం ఢిల్లీకి వచ్చిన పేద విద్యార్థులు వీరంతా అని ఆమె గుర్తుచేశారు. బస్సుల కోసం, ట్రైన్ల కోసం, అడ్మిషన్ల కోసం జీవితాంతం కష్టపడే సాధారణ కుటుంబాల పిల్లలకు ఎవరూ అండగా లేకపోతే ఎలా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం వారి గొంతునైనా ప్రశాంతంగా వినే ఓపిక ప్రభుత్వాలకు ఉండాలని అభిప్రాయపడ్డారు.

వ్యవస్థ వైఫల్యం... నందితా విమర్శ

నటి నందితా దాస్, భూమి పెడ్నేకర్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉన్న లొసుగులు, లోపాలు ఏంటో గుర్తించి వాటిని సరిదిద్దే దిశగా అందరి దృష్టి ఉండాలని ఆమె కోరారు. చదువుకునే వయస్సులో విద్యార్థులు రోడ్డెక్కి ఇబ్బందులు పడే పరిస్థితి రావడం మన వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోందని ఆమె పరోక్షంగా అసహనం వ్యక్తం చేశారు. సోనాక్షి సిన్హా, జీనత్ అమన్, నసీరుద్దీన్ షా, రత్నా పాఠక్ షా, అభయ్ డియోల్ లాంటి ఎంతో మంది దిగ్గజ నటులు సైతం ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళ నకు మద్దతుగా గొంతు కలిపారు. ఎంత కష్టాలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు సృష్టించి నా తమ సమస్యల పరిష్కారం కోసం నిలబ డిన యువతే దేశానికి అసలైన బలమని సో నాక్షి సిన్హా కొనియాడారు. శాంతియుతంగా తమ ఆందోళనను ముందుకు తీసుకెళ్తున్న విద్యార్థుల పోరాటానికి సెలబ్రిటీల నుంచి వస్తున్న ఈ మద్దతు ఇప్పుడు జాతీయ స్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది.

దక్షిణాది తారల గర్జన

కేవలం బాలీవుడ్ మాత్రమే కాకుండా సౌత్ ఇండియా సినీ పరిశ్రమ నుంచి కూడా ఈ దాడిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. మలయాళ నటుడు టొవినోథామస్ స్పందిస్తూ భవిష్యత్తు తరాల గొంతుకను అణచివేయడం అంటే నేరుగా భవిష్యత్తునే నాశనం చేయడమేనని హెచ్చరించారు. పార్వతి తిరువోతు సైతం పోలీసుల క్రూరత్వాన్ని ఎత్తిచూపుతూ ప్రభుత్వాల వద్ద చర్చలకు ఉన్న అయిష్టతను తీవ్రంగా ప్రశ్నించారు.

గూగుల్‌కు గూబగుయ్

టెక్ దిగ్గజంలో ఉద్యోగుల పోరాటం

- సీఈఓ సుందర్ పిచాయ్‌కు షాక్
- టెక్ రంగంలో ఉద్యోగ భద్రతపై నీలినీడలు
- ఏఐ మోజులో పాట్టగొడుతున్న కంపెనీ
- ఆల్ఫాబెట్ వర్కర్స్ యూనియన్ అగ్రహం



కృత్రిమ మేధస్సు పేరుతో టెక్ ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న సంస్థ తన సొంత కార్మికులనే రోడ్డున పడేస్తున్న వైనంపై ఇప్పుడు తీవ్ర చర్చ సాగుతోంది. యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఎండగడుతూ కార్మిక సంఘాలు నేరుగా రణరంగంలోకి దిగాయి. - సహనం వందే, అమెరికా

ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా నడుస్తోంది. అన్ని కంపెనీలు ఏఐ టెక్నాలజీ వైపు పరుగులు పెడుతున్నాయి. కానీ ఈ మార్పు టెక్ ఉద్యోగులకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ లో గత కొంతకాలంగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కంపెనీ లాభాల్లో దూసుకుపోతున్నప్పటికీ... ఖర్చులను తగ్గించుకునే పేరుతో ఉద్యోగులపై వేటు వేస్తుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ఆల్ఫాబెట్ వర్కర్స్ చారిత్రక పోరాటం

ఈ క్రమంలోనే ఆల్ఫాబెట్ వర్కర్స్ యూనియన్ రంగంలోకి దిగింది. గూగుల్ చరిత్రలోనే ఉద్యోగుల భద్రత కోసం జరిగిన అత్యంత పెద్ద నిరసన ఇదే కావడం విశేషం. సుమారు 100 మంది ఉద్యోగులు నేరుగా గూగుల్ క్యాంపస్ వెలుపుల నిరసనకు దిగారు. నల్లటి టీషర్టులు ధరించి తమ డిమాండ్లతో కూడిన పెద్ద బ్యానర్లను ప్రదర్శించారు. కంపెనీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన తమకు ఈ రోజు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుందర్ పిచాయ్ ఆఫీసులో ఫిర్యాదు

ఈ నిరసన కేవలం ప్రదర్శనలతోనే ఆగిపోలేదు. నేరుగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఆఫీసుకే వెళ్లి ఆ పిటిషన్‌ను అందించారు. గూగుల్‌లో పనిచేస్తున్న 4,500 మందికి పైగా ఉద్యోగులు ఈ పిటిషన్ పై సంతకాలు చేయడం గమనార్హం. ఏఐ టెక్నాలజీ పేరుతో కంపెనీ చేస్తున్న మార్పుల భారాన్ని ఉద్యోగులు ఎందుకు మోయాలని యూనియన్ గట్టిగా ప్రశ్నిస్తోంది. కంపెనీ సంపాదిస్తున్న భారీ లాభాల ఫలాలు ఉద్యోగులకు కూడా దక్కాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు ఏంటంటే...?

ఉద్యోగులు ప్రధానంగా కొన్ని కీలక డిమాండ్లను సుందర్ పిచాయ్ ముందుంచారు. మొదటిది... ఉద్యోగాల నుంచి తొలగించాల్సి వస్తే వారికి అందే సెవరెన్స్ ప్యాకేజీలకు పక్కా గ్యారంటీ ఉండాలి. రెండోది, ఎవరినైనా బలవంతంగా తొలగించే బదులు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసే బైఅవుట్ ఆప్షన్లను ఇవ్వాలని కోరుతున్నారు. అంతేకాకుండా పెర్ఫార్మెన్స్ పేరుతో వేధింపులు ఆపాలని, ఉద్యోగం పోయిన వెంటనే రోడ్డున పడకుండా ఆ సమయాన్ని పొడిగించిన పెయిడ్ లీవ్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. టెక్నాలజీ అభివృద్ధి చెందడం మంచిదే కానీ, ఆ అభివృద్ధి సామాన్యుడి జీవితాన్ని బలిగొనేలా ఉండకూడదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గూగుల్ లాంటి దిగ్గజ కంపెనీలోనే ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారితే ఇక సాధారణ ఐటీ ఉద్యోగుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

యాజమాన్యం మొండి వైఖరి...

గూగుల్ లాంటి టెక్ దిగ్గజం ఇరుకున పడటం వెనుక కేవలం మార్కెట్ ఒత్తిళ్లే కాకుండా యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరే ప్రధాన కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులను కేవలం వస్తువులుగా చూస్తూ లాభాల కోసం అర్ధంతరంగా రోడ్డున పడేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. టెక్ ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న కంపెనీయే తన ఉద్యోగులకు భద్రత కల్పించలేకపోతే ఇక డిజిటల్ భవిష్యత్తుపై నమ్మకం ఎక్కడ ఉంటుంది? సుందర్ పిచాయ్ అండ్ కో ఇప్పటికైనా తమ వ్యాపార దాహాన్ని పక్కనపెట్టి మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే రాబోయే రోజుల్లో గూగుల్‌కు వ్యతిరేకంగా ఈ నిరసనలు మరింత ఉధృతమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.టెక్నాలజీని సృష్టించిన మనుషులకే ఇప్పుడు టెక్నాలజీ రూపంలోనే ఉపాధి గండం ముంచుకొస్తోందంటే ఎవరికైనా బాధ అనిపిస్తుంది.

అగ్గి రాజేసిన నిరసనల అల

ఉద్యమాల ఉప్పెన... ప్రభుత్వాలపై ఫైర్

- మండిపడుతున్న దేశం... రోడ్డెక్కిన జనం
- విద్యార్థులు, రైతులు, గిరిజనుల ఉద్యమాలు
- దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాల వెల్లువ
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రభుత్వాలు

దేశవ్యాప్తంగా నిప్పులు కక్కుతున్న ప్రజాగ్రహం పాలకుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. విద్య, వ్యవసాయం, పర్యావరణం కోసం సాగుతున్న ఈ పోరాటాలు అణచివేతను ఎదిరిస్తున్నాయి. సీజేపీ ఉద్యమం నుంచి రైతుల కవాతు వరకు... జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ రాష్ట్ర ఉద్యమ ర్యాలీ నుంచి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మధ్య సాగుతున్న కేన్ బెత్వా నదుల అనుసంధాన వ్యతిరేక పోరు వరకు ప్రతి గొంతు ప్రభుత్వాలను నిలదీస్తున్న వైనంపై ప్రత్యేక కథనం. - సహనం వందే, హైదరాబాద్

దేశీయ గడ్డపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. వివిధ వర్గాలు తమ హక్కుల కోసం నేరుగా పోరుబాట పట్టాయి. రాజధాని వీధుల నుంచి మారుమూల గ్రామాల వరకు అశాంతి అలుముకుంది. ప్రభుత్వాల విధానాలపై ప్రజలు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఢిల్లీ నుంచి జమ్మూ కాశ్మీర్ వరకు, మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్ సరిహద్దుల వరకు ఈ నిరసనలు పాలకుల కుర్చీలను కదిలిస్తున్నాయి. పాలక వర్గాల అణచివేత చర్యలను ఈ ఉద్యమాలు తిప్పికొడుతున్నాయి.

రైతుల రణభూమి

అన్నదాతల కవాతు దేశ రాజధాని ఢిల్లీని తాకింది. అమెరికాతో ఇండియా చేసుకున్న ఒప్పందాలు, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న తీరుపై పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన రైతులు భగ్గుమంటున్నారు. నల్ల చట్టాల గాయాలు మానకముందే కొత్త ముప్పులు ముంచుకొస్తున్నాయని రైతాంగం మండిపడుతోంది. గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు రోడ్డెక్కారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారిన వ్యవసాయ విధానాలను అడ్డుకుంటామని దేశ రాజధాని వేదికగా హెచ్చరిస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే చేతులకు బేడీలు వేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల తిరుగుబాటు

నీట్ పేపర్ లీక్, విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న తీరుపై దేశవ్యాప్తంగా సీజేపీ ఆధ్వర్యంలో ఉవ్వెత్తున ఉద్యమం ఎగిసిపడింది. ముఖ్యంగా జేఎన్ యూ, డీయూ లాంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి రాష్ట్ర స్థాయి క్యాంపస్ ల వరకు చదువును దూరం చేసే కుట్రలపై యువత కన్నెర్రజేసింది. నిరుద్యోగం, ప్రశ్నించే గొంతులను నొక్కివేస్తున్న తీరుపై విద్యార్థులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. క్యాంపస్‌ల నుంచి పార్లమెంట్ వీధుల వరకు విద్యార్థుల నినాదాలతో హోరెత్తుతోంది. ప్రభుత్వాల నియంతృత్వ విధానాలకు చరమగీతం పాడుతామని యువత శపథం చేస్తోంది.

రాష్ట్రాల ఆక్రోశం

ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్లు మళ్లీ జమ్మూ కాశ్మీర్ కేంద్రంగా తెరపైకి వచ్చాయి. నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో శ్రీనగర్ లో నిర్వహించిన భారీ రాష్ట్ర ఉద్యమ ర్యాలీ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ప్రాంతీయ ఆకాంక్షలను కాలరాస్తూ కేంద్రం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దశాబ్దాల ఆశలను నెరవేర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హక్కుల సాధన కోసం సాగుతున్న ఈ పోరులో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పాలకుల మొండివైఖరి కారణంగానే ఈ ప్రాంతీయ ఉద్యమాలు ఉద్ధృతమవుతున్నాయి.

ప్రకృతి విలయం

మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో కేన్ బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టును స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటం ఉధృత రూపం దాల్చుతోంది. పచ్చని అడవులను, జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తూ చేపడుతున్న ఈ ప్రాజెక్టుల వల్ల కోట్లాది మంది జీవనం ప్రశ్నార్థకమవుతోంది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని బలిపెడుతున్న తీరును పర్యావరణవేత్తలు ఎండగడుతున్నారు. ప్రాజెక్టులను వెంటనే ఆపకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

గిరిజనుల గర్జన

జార్ఖండ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా అటవీ ప్రాంతాల్లో అడవి బిడ్డల ఉనికిపై జరుగుతున్న దాడులను గిరిజనులు గట్టిగా తిప్పికొడుతున్నారు. నీరు, భూమి హక్కుల కోసం గిరిజన సంఘాలు ఉద్యమ బాట పట్టాయి. మైనింగ్ మాఫియా, కార్పొరేట్ కంపెనీల కబంధ హస్తాల నుంచి తమ జల్ జంగల్ జమీన్ ను కాపాడుకోవడానికి గిరిజనులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల తీరుపై ఆదివాసులు తిరుగుబాటు చేస్తున్నారు.